నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, శనివారం 29 మార్చి 2025 VIKARABAD



## అమన్ స్వీట్ ఫ్యాక్టరీ సీజ్..

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ): ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు శుక్రవారం పలు చోట్ల తనిఖీలు నిర్వహించారు. అల్వాల్‌లోని కింగ్స్ 7 బేకరీ, మాదాపూర్‌లోని పాలమూరు గ్రిల్, జవహర్‌నగర్‌లోని తిరుమల మెస్ అండ్ కర్రీ పాయింట్, ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని బావర్చి రెస్టారెంట్, గచ్చిబౌలిలోని సిప్ అండ్ స్నాక్స్‌లను తనిఖీలు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. అలాగే, మల్లాపూర్‌లో అమన్ స్వీట్ ఫ్యాక్టరీలో గడువు ముగిసిన స్వీట్లతో మళ్లీ తయారు చేస్తున్నట్లు గుర్తించి.. సంబంధిత ఫ్యాక్టరీని సీజ్ చేశారు.


### పోలీసులు, రెవెన్యూ అధికారుల అండదండలతోనే

## రామోజీ భూఅక్రమాలు..

**రామోజీ ఫిలింసిటీ ఆధీనంలో ఉన్న స్థలాలను విడిపించి పేదలకు పంచాలి**

- లేకుంటే వారం రోజుల్లో మరో పోరాటానికి సిద్ధం
- సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య

ఇబ్రహీంపట్నం, మార్చి 28 : రామోజీ ఫిలింసిటీ ఆధీనంలో ఉన్న స్థలాలను విడిపించి పేదలకు ఇండ్ల స్థలాలకు పంపిణీ చేయకుంటే వారం రోజుల్లో మరో పోరాటానికి సిద్ధమవుతామని సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య హెచ్చరించారు. శుక్రవారం ఆయన ఇబ్రహీంపట్నంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలోని నాగన్‌పల్లి గ్రామంలో 2007లో అప్పటి ప్రభుత్వం పేదలకు ప్రతి ఒక్కరికీ 60 గజాల చొప్పున ఇండ్ల పట్టాలిచ్చి నక్ష ప్రకారం పొజిషన్ కూడా చూపించిందన్నారు. అయితే, పట్టాలు తీసుకున్న వారందరూ కలిసి తమ స్థలాల్లోకి వెళ్తే పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని మండిపడ్డారు. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం అండదండలతోనే ఆ స్థలాలను రామోజీరావు ఆక్రమించాడన్నారు. ఇండ్ల లబ్ధిదారులు అక్కడికి రాకుండా ఇబ్బందులు పెట్టడంతోపాటు ఇంటి స్థలాలకు వెళ్లే దారుల్లో కందకాలు తీసి.. అడ్డుగా గోడను నిర్మించిందన్నారు. మహిళలు అని కూడా చూడకుండా పోలీసులు విచక్షణారహితంగా ప్రవర్తించారని.. ఇండ్ల స్థలాల పోరాట కమిటీ కన్వీనర్‌కు గాయాలయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఈ పోరాటం ఇంతటితో ఆగే ప్రసక్తే లేదని రామోజీ ఫిలింసిటీ ఆధీనంలో ఉన్న మరో 370 ఎకరాలను కూడా పదివేల మందితో వెళ్లి ఆక్రమిస్తామని హెచ్చరించారు. పేదలు తమ స్థలాల కోసం 18 ఏండ్లుగా పోరాడుతున్నారన్నారు. రామోజీ రావు యాజమాన్యం ఆక్రమించిన పేదల ఇండ్ల స్థలాలను తిరిగి అప్పగించే వర కు సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలను నిర్వహిస్తామని ఆయన తేల్చి చెప్పారు.



విలేకరులతో మాట్లాడుతున్న సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య



ఇసుకను అక్రమంగా తరలించడంతో పోలీసులు సీజ్ చేసిన ట్రాక్టర్లు

### ఇసుక మాఫియా

# బరితెగింపు

**స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత అండ..?**

- కాగ్నానది నుంచి అడ్డూఅదుపు లేకుండా ఇసుక తరలింపు
- ఇటీవల ఇసుక అక్రమ రవాణాపై పోలీసులకు వ్యక్తి ఫిర్యాదు
- మామూళ్ల మత్తులో జోగుతూ.. ఫిర్యాదుదారు సమాచారాన్ని అక్రమార్కులకు లీక్ చేసిన పోలీసులు
- అర్ధరాత్రి వేళ ఫిర్యాదుదారు ఇంటికెళ్లి దాడి.. చంపుతామని బెదిరింపు
- పోలీసుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు
- అధికార పార్టీ నాయకుల అండతోనే అని స్థానికుల ఆరోపణ

వికారాబాద్, మార్చి 28 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని తాండూరు నియోజకవర్గంలో ఇసుక మాఫియా బరితెగిస్తున్నది. స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేత అండతోనే రెచ్చిపోతున్నదనే ఆరోపణలున్నాయి. యాలాల, తాండూరు మండలాల మీదుగా వెళ్లే కాగ్నానది కేంద్రంగా ఇసుక అక్రమ రవాణా అడ్డూఅదుపు లేకుండా సాగుతున్నది. అడ్డుకట్ట వేయాల్సిన పోలీస్, రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిడులకు తలొగ్గి వారు చెప్పినట్లు వింటున్నారనే ఆరోపణలున్నాయి.

మూడు రోజుల కిందట తాండూరు మండలంలోని వీరశెట్టిపల్లికి చెందిన ఓ వ్యక్తి కాగ్నానది నుంచి కొందరు రాత్రి సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం ఇవ్వగా.. స్పందించిన పోలీసులు అక్కడికెళ్లి ఆ ట్రాక్టర్లను సీజ్ చేశారు. అయితే, ఇంతవరకు బాగానే ఉన్నా డయల్ 100కు ఫిర్యాదు చేసిన వ్యక్తి వివరాలను ఎవరికీ చెప్పొద్దన్న విషయాన్ని మరిచిన పోలీసులు.. ఫిర్యాదుదారు(ఫిరంగి జర్నప్ప) పేరును ఇసుక మాఫియాకు చెప్పడంతో.. వారు అర్ధరాత్రి సమయంలో వీరశెట్టిపల్లికి వెళ్లి జర్నప్ప ఇంటిపై దాడి చేసి అతడితోపాటు కుటుంబ సభ్యులనూ చంపుతామని బెదిరించారు. ఇసుక మాఫియా దాడితో ఆ ఊరంతా భయాందోళనకు గురైంది. ఇసుక మాఫియా తనపై దాడి చేసిందని జర్నప్ప పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పట్టించుకోకపోవడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పోలీసులు ఇసుక మాఫియాతో చేతులు కలపడంతోనే ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నదని.. స్థానిక కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుడి ఆదేశాలతోనే పోలీసులు ఇసుక మాఫియాపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. తాండూరు నియోజకవర్గం లో అతడు చెప్పిందే వేదంలా నడుస్తున్నదనే ప్రచారమూ జరుగుతున్నది. కాగా, ఫిర్యాదు చేసిన వ్యక్తి కూడా స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడే కావడం గమనార్హం.



ఇటీవల ఇసుక మాఫియా తనపై చేసిన దాడిపై కరణ్‌కోట్ ఠాణాలో ఫిర్యాదు చేసేందుకు వీరశెట్టిపల్లి గ్రామస్తులతో కలిసి వచ్చిన జర్నప్ప

### రాత్రివేళల్లో యథేచ్ఛగా..

జిల్లాలోని కాగ్నానది నుంచి ఇసుకను అక్రమంగా తోడేస్తున్నారు. రాత్రికి రాత్రే ఇసుక డంపులను ఇసుక మాఫియా మాయం చేస్తున్నది. జిల్లాలో ఇసుక లభ్యమయ్యే యాలాల, తాండూరు మండలాల నుంచి అధికంగా తరలిస్తున్నది. ఒక్క యాలాల మండలంలోనే లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను దాదాపుగా 40-50 ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా తరలిస్తున్నది. ఈ దందాను స్థానిక పోలీసులు దగ్గరుండి చూసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక మాఫియా ఇచ్చే డబ్బులకు ఆశపడి వారిపై చర్యలు తీసుకోవడంలో గనులు, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అదేవిధంగా కొడంగల్, బొంరాస్‌పేట మండలాల్లో ఫిల్టర్ ఇసుక అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నా పట్టించుకునే నాథుడే లేదని ప్రజలు మండిపడుతున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిబంధనల ప్రకారం ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఇసుకను తరలించేందుకు అనుమతులు పొంది.. రాత్రి వేళల్లోనూ యథేచ్ఛగా తరలిస్తున్నారని పలు గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అయితే, కొందరు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల పేరిట పర్మిషన్ తీసుకుని గుట్టుచప్పుడు కాకుండా ఇసుకను తరలిస్తూ అక్రమంగా సంపాదిస్తున్నారనే ఆరోపణలున్నాయి. తాండూరులో నర్సింగ్ కాలేజీ, తాండూరు మార్కెట్ కమిటీ గోదాంల నిర్మాణానికి అనుమతులు పొందిన వారు రాత్రి సమయాల్లో గుట్టు చప్పుడు కాకుండా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ సంపదను కొల్లగొడుతున్నారు. యాలాల, తాండూరు, బషీరాబాద్ మండలాల్లోని కాగ్నానది పరీవాహక ప్రాంతాలతోపాటు శివసాగర్‌లో అధిక మొత్తం లో ఇసుక వనరులున్నాయి. ఈ ప్రాంతాల నుంచి ప్రతిఏటా రూ.కోట్ల విలువైన ఇసుక లభ్యమవుతున్నది. కాగా, ఇసుకను తరలించే అన్ని ట్రాక్టర్లకు జీపీఎస్ యంత్రాలను అమర్చడంతోపాటు సంబంధిత అధికారులు పక్కా నిఘా పెడితేనే ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవచ్చునని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

### పోలీసులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు..

ప్రాణం పోయినా కేసు వెనక్కి తీసుకోను. ఇసుక అక్రమ రవాణాపై కరణ్‌కోట్ పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు ఇసుక మాఫియాకు తన వివరాలను చెప్పడంతో ఇంటిపై కొచ్చి దాడి చేశారు. నాపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఠాణాలో ఫిర్యాదు చేస్తే భీమప్ప, నర్సింహులుతోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు ఎఫ్ఐఆర్ కాపీ ఇచ్చారు. కానీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. నాకు న్యాయం జరిగే వరకు పోరాడుతా. ఇసుక అక్రమ రవాణా, తనపై జరిగిన దాడి విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా. గొంతులో ప్రాణం ఉన్నంత వరకూ పోరాడుతా..

**- ఫిరంగి జర్నప్ప, ఫిర్యాదుదారుడు (స్థానిక కాంగ్రెస్ నాయకుడు), వీరశెట్టిపల్లి, తాండూరు**



## రియల్ వ్యాపారులు బెంబేలు

**విస్తృతంగా వైరల్ అయిన నమస్తే కథనం**

నమస్తే ఎఫెక్ట్

సిటీబ్యూరో, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్‌లో రియల్ రంగం కుదేలైందని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ వెల్లడించిన విస్మయకర వాస్తవాలను 'నమస్తే'లో శుక్రవారం 'అట్టడుగుకు రియాల్టీ' శీర్షికన ప్రచురితమైన కథనం తెలంగాణలో విస్తృతంగా వైరలయింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, సంబంధీకులు ఈ కథనంపై జోరుగా చర్చిస్తున్నారు. వారి రియల్ ఎస్టేట్ సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ చేశారు. నగరంలో ఏకంగా 49 శాతం మేర ఇండ్ల అమ్మకాలు పడిపోయాయ ని, దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో కంటే హైదరాబాదే అట్టడుగులో ఉందని తేల్చడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారుల్లో తీవ్ర ఆందోళన నెలకొన్నది. హైదరాబాద్ ఆఫీస్ లీజింగ్‌లో పతనావస్థకు చేరడం కూడా ఇప్పుడు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నది. దేశ వ్యాప్తంగా ఉన్న ఏడు ప్రధాన నగరాల్లో తొలి మూడు నెలల్లో ఆఫీస్ వసతుల లీజింగ్ అద్భుత వృద్ధిని సాధించగా, హైదరాబాద్‌లో మాత్రం తగ్గుముఖం పట్టింది.

రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ 'కొలియర్స్ ఇండియా' విడుదల చేసిన నివేదికలో టాప్ 7 నగరాల్లో స్థూలంగా 159 లక్షల చదరపు అడుగు మేర(ఎస్ఎఫ్టీ) ఆఫీస్ లీజింగ్ లావాదేవీలు జరిగాయని తేల్చింది. కానీ హైదరాబాద్‌లో మాత్రం 17 లక్షల చదరపు అడుగుల లీజింగ్ లావాదేవీలు మాత్రమే జరిగాయి. గతేడాది మొదటి మూడు నెలల్లో లీజింగ్ 29 లక్షలతో పోల్చి చూస్తే ఇప్పుడు 41 శాతం తగ్గినట్టు పేర్కొంది. దీంతో హైదరాబాద్ ప్రతిష్ట జాతీయ, అంతర్జాతీయంగా దిగజారిపోతున్నది.



పోస్టుకార్డును చూపుతున్న మాజీ సర్పంచ్ బల్వంత్‌రెడ్డి




దోమ : బాక్స్ పోస్టుకార్డును వేస్తున్న మాజీ సర్పంచ్ రాజిరెడ్డి

### పెండింగ్ బిల్లులు చెల్లించాలని

## సీఎంకు పోస్టుకార్డులు

ఇబ్రహీంపట్నం/ఆమనగల్లు/దోమ, మార్చి 28 : గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, దేశంలోనే తెలంగాణ పల్లెలను ఆదర్శంగా తీర్చిదిద్దితే.. రేవంత్ సర్కార్ సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను విడుదల చేయకుండా 16 నెలలుగా తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నదని సర్పంచ్‌ల ఫోరం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డితోపాటు పలువురు మాజీ సర్పంచ్‌లు పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర స్థాయి పోస్టుకార్డు ఉద్యమాన్ని మండలంలోని రాయపోల్, దండుమైలారం, ముకునూరు, తుర్కగూడ, పోచారం, కప్పాడు, పోల్కంపల్లి, నాగన్‌పల్లిపాటు పలు గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు చేపట్టారు. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లులను త్వరగా చెల్లించాలని రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్టుకార్డులు రాసి అక్కడి పోస్ట్‌మన్లకు ఇచ్చారు. గ్రామాల అభ్యున్నతికి కృషి చేసిన మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదేవిధంగా ఆమనగల్లు మండలంలోని మాజీ సర్పంచ్‌లు శ్రీనూనాయక్, లక్ష్మణ్ పోస్టాఫీస్‌కు వెళ్లి పోస్టు కార్డుపై తమ పెండింగ్ బిల్లులను త్వరగా చెల్లించాలని రాసి ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లేలా పోస్ట్ బాక్స్‌లో వేశారు. అదేవిధంగా పెండింగ్ బిల్లులను త్వరగా చెల్లించాలని సర్పంచ్‌ల సంఘం దోమ మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి సీఎంకు పోస్టుకార్డు పంపించారు.



ఆమనగల్లు : బాక్స్‌లో పోస్టుకార్డులు వేస్తున్న మాజీ సర్పంచ్‌లు శ్రీనూనాయక్, లక్ష్మణ్

### ప్రభుత్వం సహకరించకున్నా.. అప్పులు చేసి పంటల సాగు..

## కౌలు రైతుకు

# మిగిలింది కన్నీరే..

- అడుగంటిన భూగర్భ జలాలతో ఎండిపోయిన పంటలు
- చేసిన అప్పులు తీర్చే మార్గం లేక.. ఆందోళనలో అన్నదాత
- రంగారెడ్డి జిల్లాలో సుమారు లక్షమందికి పైగా కౌలు రైతులు

రంగారెడ్డి, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఏ కౌలురైతును కదిలించినా కన్నీటి పర్యంతమవుతున్నాడు. ఉపాధి అవకాశాల్లేక గ్రా మీణ ప్రాంతాల్లోని భూములను కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసిన కౌలు రైతులు జిల్లాలో 30 శాతానికిపైగా ఉన్నారు. వీరంతా అప్పులు చేసి వరి, పత్తి, మొక్కజొన్న ఇతర కూరగాయల పంటలేశారు. జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటడంతో బోరుబావులు ఎండిపోయాయి. దీంతో బోర్లను నమ్ముకుని సాగు చేసిన పంటలు మొత్తం ఎండిపోయి.. పంటల సాగుకు తీసుకొచ్చిన అప్పులు మీదపడే పరిస్థితి ఏర్పడింది. ఒక్కొక్క కౌలు రైతు సుమారు రూ.లక్ష నుంచి రూ. రెండు లక్షల వరకు అప్పు చేసి పంటలు సాగు చేశారు. ఈ పంటలు పూర్తిగా ఎండిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. జిల్లాలోని 21 మండలాల్లో ప్రతి గ్రామానికీ పది నుంచి పదిహేను మంది వరకు కౌలు రైతులు ఉన్నారు.

### కౌలు రైతులు.. లక్ష మందికిపైగా..

జిల్లాలో సుమారు లక్ష మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. వీరంతా సంబంధిత భూయజమానుల నుంచి భూములను కౌలుకు తీసుకుని వరి, పత్తి, మొక్కజొన్నతోపాటు ఇతర కూరగాయల పంటలను సాగుచేశారు. కాగా, జిల్లాలో మొత్తం 3.25 లక్షల మందికి పైగా రైతులుండగా.. అందులో లక్ష వరకు కౌలు రైతులున్నారు. మాడ్గుల, ఆమనగల్లు, తలకొండపల్లి, షాబాద్, చేవెళ్ల, యాచారం, మంచాల వంటి ప్రాంతాల్లో పొలాలను కౌలుకు తీసుకుని పత్తి పంటను సాగు చేశారు. ఆ పంట దిగుబడి కూడా ఆశించిన మేర కు రాకపోవడంతో వీరంతా అప్పుల ఊబిలో కూరుకుపోయారు. అలాగే, మిగతా మండలాల్లో కౌలురైతులు వరి, మొక్కజొన్న, కూరగాయల పంటలు వేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించక పొలాలు పూర్తిగా ఎండిపోయాయి. దీంతో చేసిన అప్పులను ఎలా తీర్చాలని మథనపడుతున్నారు.

### ప్రభుత్వం ఆదుకోకుంటే ..

ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని పలువురు కౌలు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూములను కౌలుకు తీసుకుని.. వ్యాపారుల వద్ద వడ్డీకి డబ్బు తీసుకొచ్చి పంటలను సాగు చేశామని.. భూగర్భజలాలు అడుగంటడంతో పంటలు మొత్తం ఎండిపోయాయని.. ఈ పరిస్థితిలో ప్రభుత్వం ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని పేర్కొంటున్నారు.





### అలసంద తోటా ఎండిపోయింది..

ఎకరం పొలంలో అలసంద తోట వేశా. నీటి తడుల్లో తేడాల్లొచ్చినా ఆ తోట తట్టుకుంటుందని, మంచి దిగుబడి వస్తుందని పక్క రైతు ఇచ్చిన సలహా మేరకు సాగు చేశా. అయితే, భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోవడంతో ఆ తోటకు సరిపడా నీరందక పంట మొత్తం ఎండిపోయింది. పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొన్నది.

**-దండె కిష్టయ్య, చిత్తాపూర్, మంచాల**

### ఎండిన పంటను చూస్తే గుండె తరుక్కుపోతున్నది..

బోరు ఉన్నదన్న నమ్మకంతో నాలుగు ఎకరాల్లో వరి పంటను సాగు చేశా. భూగర్భజలాలు తగ్గడంతో బోరు ఎండిపోయింది. దీంతో పంటను కాపాడుకునేం దుకు అదనంగా మరోబోరును తవ్వించా. ఆ బోరు నుంచి కూడా నీరు రాక పంట మొత్తం ఎండిపోయింది. ఆ పంటను కోసి పశువులకు మేతగా వేస్తున్నా. ఎండిపో యిన పంటను చూసి గుండె తరుక్కుపోతున్నది. పంట సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించడంలేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

**-యాదగిరిరెడ్డి, రైతు, చిత్తాపూర్, మంచాల**



### అప్పులే మిగిలాయి..

ఈ యాసంగిలో పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తిని సాగు చేస్తే అప్పులే మిగిలాయి. ఆదాయం మాట అటుంచితే, చేసిన అప్పులు తీరితే బాగుండు. నల్లచెరువు గ్రామంలో ఆరెకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పత్తిని సాగు చేశా. వర్షాలు కురువకపోవడంతో పంట మొత్తం ఎండిపోయి దిగుబడి రాలేదు. వచ్చిన అంతంత మాత్రం డబ్బు భూ యజమానులకు కూడా సరిపోని పరిస్థితి నెలకొన్నది.

**-కట్ట భద్రయ్య, కౌలురైతు, నల్లచెరువు మాడ్గుల**



### పంటలన్నీ ఎండిపోయాయి..

పది ఎకరాలను కౌలుకు తీసుకుని పత్తి, వరి, ఇతర కూరగాయలను సాగు చేశా. పెట్టుబడి కోసం సుమారు రూ. నాలుగు లక్షలు ఖర్చు అయ్యింది. నీటి వనరుల్లేక వేసిన పంటలన్నీ ఎండిపోయాయి. దీంతో భూ యజమానులకు ఏమి ఇవ్వాలో అర్థం కావడంలేదు. చేసిన కష్టమంతా వృథాగా పోవడంతోపాటు అప్పులే మిగిలాయి.

**-పందుల నర్సింహ గౌడ్, బ్రాహ్మణపల్లి, మాడ్గుల**



### కష్టమంతా వృథాగా..

ఎనిమిదెకరాల భూమిని కౌలుకు తీసుకుని పత్తిని సాగు చేశా. పెట్టుబడి కోసం సుమారు రూ. నాలుగు లక్షలు ఖర్చు అయ్యిం ది. అయితే పెట్టుబడిలో సగం కూడా రాలేదు. వచ్చిన ఆ మొత్తం కూడా భూ యజమానులకే చెల్లించా. నాకు మాత్రం అప్పులే మిగిలాయి. చేసిన కష్టమంతా వృథాగా పోయింది.

**-అనిల్‌కుమార్, కౌలు రైతు, మాడ్గుల**

